# ప్రాప్తం

డాక్టర్ చిన్నకోట సుశీలాదేవి




"అమ్మా! వచ్చే శుక్రవారం మేం తిరుపతి వెడుతున్నాం" అన్నాడొక రోజు కొడుకు రఘురాం.

ఆ మాట విన్న కమలమ్మ ఉలిక్కిపడి చూసింది. ఆమె మనస్సు తెలీని ఆనందంతో ఉక్కిరిబిక్కిరైంది. ఏరుతున్న బియ్యం చేట ప్రక్కన పెట్టి....

"హఠాత్తుగా ఇప్పుడే ప్రయాణం ఎందుకురా?" అంది ఆఫీసు పనిమీద వెడుతున్నాడేమోననే అనుమానంతో.

"బాబిగాడికి పుట్టు వెంట్రుకలు తీయించాలిగా. వాడికి సంవత్సరం నిండిపోతోంది. అనుకోకుండా ఈ వారం చివర్లో రెండు రోజులు శలవులు వచ్చాయి. అందుకే వెళ్ళొద్దామనుకుంటున్నాం!" అన్నాడు.

"ఎవరెవరు వెడుతున్నారు?" అనడిగింది.

"నేనూ, పద్మా. ఇంకెవరున్నారు?"

ఆ మాటతో కమలమ్మ మనస్సు చివుక్కుమంది.

"నేను రావద్దా?" అనబోయింది కాని కొడుకు తన మాటే ఎత్తలేదు. వాడికి తనని తీసుకెళ్ళడం ఇష్టం లేదేమో అనుకుంది. తనంతట తాను అడగాలంటే మొహమాటపడింది.

"పద్మా! ఆఫీసు టైమవుతోంది. బాక్సు రెడీ చెయ్యి!" అంటూ రఘురాం లోపలికి వెళ్ళిపోయాడు.

కమలమ్మ మనసు మనసులో లేదు. ఎన్నాళ్ళ నుండో తిరుపతి వెళ్ళాలనుకుంటోంది. కొడుకు చిన్నప్పుడు వాడి ఆరోగ్యం కోసం తను కట్టిన ముడుపు అలాగే ఉండిపోయింది. తిరుపతి వెళ్ళే అవకాశమే రాలేదు. ఇన్నాళ్ళకి కొడుకు కోడలు వెడుతున్నారు. తనని కూడా తీసుకెడితే తన మొక్కు తీర్చుకుంటుంది. ఎలాగైనా వాళ్ళతో వెళ్ళాలి అనుకుంది.

మధ్యాహ్నం టీ.వి. చూస్తున్న కోడలు పద్మ ప్రక్కన చేరింది కమలమ్మ.

"అమ్మాయ్! తిరుపతి వెడుతున్నారటగా!" అంటూ సంభాషణ మొదలుపెట్టింది.

"అవునత్తయ్యా! బాబిగాడికి పుట్టు వెంట్రుకలు తీయించాలిగా! తిరుపతిలో జుట్టు తీయిస్తానని మొక్కుకున్నాం, వాడికి మళ్ళీ రెండో ఏడు వస్తోంది. అందుకే వెడుతున్నాం" అంది పద్మ.

"నాకూ ఎప్పటి నుండో మొక్కు ఒకటి ఉండిపోయింది. రఘురాం చిన్నప్పుడు మొక్కు పెట్టుకుని ముడుపు కట్టాను. తిరుపతి వెళ్ళి హుండీలో వేయాలనుకున్నా ఆ కోరిక ఇంతవరకు తీరలేదు" అంది కమలమ్మ నిట్టూరుస్తూ.

"ఇప్పుడు మేం వెడుతున్నాం కదా! అవి మాకివ్వండి మేం వేస్తాం" అంది పద్మ.

"అబ్బే! అలా ఇవ్వడానికి కుదరదమ్మాయ్! నేనే స్వయంగా వచ్చి వేస్తానని మొక్కు పెట్టుకున్నా!"

"అదేమిటత్తయ్యా! మీకు బస్సు పడదని తెలిసీ ఎలా మొక్కుకున్నారు? ఎవరిదో పెళ్ళికని తిరుపతి వెళ్ళి అక్కడ పడకేశారుట... నాలుగు రోజుల ఆసుపత్రిలో కూడా ఉన్నారటగా" అంది

పద్మ మెల్లగా.

ఆ ప్రశ్నతో కమలమ్మ మనస్సు చివుక్కుమంది. కోడలు అలా ముఖంమీదనే అడిగేసరికి ఏమనాలో తెలీక తబ్బిబ్బు పడింది. తను రహస్యంగా ఉంచుకున్న విషయం కోడలికి తెలిసిందని అవమానపడింది. ఎప్పుడో జరిగిన ఆ విషయం కోడలికి ఎందుకు చెప్పాల్సివచ్చిందని కొడుకుమీద కోపగించుకుంది.

"అప్పుడు మామయ్యగారికి బాగా కోపం వచ్చిందటగా!" అంది పద్మ నవ్వు దాచుకుంటూ.

"అవన్నీ నీకెందుకమ్మాయ్!" కోపంగా అనేసి కమలమ్మ లేచి వచ్చేసింది.

తన గదిలోకొచ్చి మంచంమీద పడుకుంది.

కోడలు అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి.

తనకు బస్సు పడదా!? అదెప్పటి సంగతో కదా... మనసులో ఎన్నో ఏళ్ళ క్రిందట జరిగిన ఆ సంఘటన మెదిలింది.

* * *

చాలా ఏళ్ళ క్రితం. అప్పుడు రఘురాంకి పదేళ్ళ వయసుంటుందేమో!... కమలమ్మ మావయ్య కూతురి పెళ్ళి తిరుపతిలో జరిగింది. వాళ్ళు అందరితో పాటు కమలమ్మకి ఆమె భర్తకి కూడా రైల్లో టిక్కెట్లు రిజర్వు చేశారు. కమలమ్మ భర్త గోపాలరావు స్కూలు టీచరు రెండ్రోజులు శెలవుపెట్టి భార్యా కొడుకుతో బయలుదేరాడు.

'ఏవండీ! కొడుకు పుడితే కొండకొస్తామని మొక్కుకున్నాం గదా! ఆ మొక్కు అలాగే ఉండిపోయింది. వాడికి పదేళ్ళు వస్తున్నా మనకు తిరుపతి వెళ్ళే యోగం లేకపోయిందని ఇన్నాళ్ళూ బాధపడ్డాను. ఇప్పుడు అనుకోకుండా ఆ దేవుడే ఈ అవకాశాన్ని కల్పించాడు. అంతా ఆయన దయ!" కమలమ్మ ఆనందంతో పొంగిపోతూ అన్నది భర్తతో.

ఆయన కూడా ఇన్నాళ్ళకి దైవదర్శనం కలగబోతోందని ఉత్సాహంగా ఉన్నాడు.

తిరుపతిలో రైలు దిగి తిరుమలకి బస్సులో బయలుదేరారు. బస్సు కొద్ది దూరం వెళ్ళిందో లేదో కమలమ్మకి కడుపులో త్రిప్పడం మొదలైంది. బస్సు ఒక్కొక్క మలుపు తిరుగుతుంటే భళ్ళున వాంతి అయిపోతోంది. బస్సు ఏడు కొండలూ ఎక్కి స్టాపులో ఆగేసరికి కమలమ్మ ఎడతెగని వాంతులతో స్పృహ తప్పి పడిపోయింది. పెళ్ళివారందరూ కంగారు పడిపోయారు. డాక్టర్‌ని పిలిపించారు. సెలైన్ బాటిల్స్ ఎక్కించారు. మేనమామ పెళ్ళివారి మర్యాదల గురించి కంటే కమలమ్మ ఆరోగ్యం గురించి ఎక్కువ దిగులుపడ్డాడు. పెళ్ళయిపోయింది. అందరూ తిరుగు ప్రయాణమయ్యారు. కాని కమలమ్మ పూర్తిగా కోలుకోలేదు. కమలమ్మ కోసం ఆమె భర్త కూడా ఉండిపోయాడు. మరొక వారం హాస్పిటల్‌లో వుండి పది వేలు ఖర్చయ్యాక గాని కమలమ్మ కోలుకోలేదు. ఇంటికి వస్తూనే భార్య మీద మండిపడ్డాడు గోపాల్రావు.

'నీకు బస్సు పడదనే విషయం ముందే చెప్పొద్దూ. ఈ ప్రయాణం మానుకునేవాళ్ళం కదా! అనవసరంగా పదివేలు ఖర్చయ్యాయి. వారం రోజుల సెలవు పోయింది. పెళ్ళివారందరి ముందూ తీవ్రమైన అవమానం! ఛ... ఛ... ఇక జీవితంలో నీతో ఎక్కడికైనా వస్తే ఒట్టు!" అన్నాడు తీవ్రంగా.

భర్తా, తనూ కలిసి బయటికి వెళ్ళే సందర్భాలు చాలా తక్కువ. ఇన్నాళ్ళకి కలిసి ప్రయాణం చేశామనే ఆనందం కూడా మిగల లేదు. భర్త మాటలకు మనసు గాయపడ్డా చేసేదేం లేక అంతా తన ఖర్మ అనుకుంటూ మౌనంగా ఉండిపోయింది కమలమ్మ.

ఇక దేవుడికి మొక్కులు పెట్టుకోకూడదు. తీర్చలేకపోతే అదో బాధ అనుకుంది.

కాని మరో రెండేళ్ళ తరువాత ఒక అనుకోని సంఘటన జరిగింది. ఒక రోజు రఘురాం స్కూల్లో ఉన్న నేరేడు చెట్టు ఎక్కి పై కొమ్మ మీద నుండి పడిపోయాడు. గంట వరకూ స్పృహ రాలేదు. కమలమ్మ, గోపాల్రావు కంగారు పడిపోయారు. లేక లేక కలిగిన ఒక్కగానొక్క కొడుకు ఏమైపోతాడోనని తల్లడిల్లిపోయారు. చివరకు గంట తర్వాత డాక్టర్లు అతి ప్రయత్నం మీద కళ్ళు తెరిచాడు. గండం గడిచింది. కాని వెన్నెముక పక్కనున్న రెండు ఎముకలు విరిగాయి. ఆపరేషను చేసినా ప్రయోజనం లేకపోయింది. కొడుకు జీవితాంతం మంచంలో వుండిపోవాలా అనుకుంటూ దిగులుపడిపోయారు.

అప్పుడే గోపాల్రావు కొలీగ్ పుత్తూరు తీసుకెళ్ళండి, మీ అబ్బాయికి నయమైపోతుంది అని సలహా ఇచ్చారు. వెంటనే కారు మాట్లాడుకుని కొడుకుని తీసుకుని బయలుదేరారు కమలమ్మ, గోపాల్రావులు. కారులో వెడుతుండగా కొడుకుని కాపాడమని దేవుడికి మొక్కుకుంది కమలమ్మ. పుత్తూరులో కొడుక్కు నయమైంది. మూడో రోజు నుండి నడవడం ప్రారంభించాడు. అది చూసి తల్లిదండ్రులు పొంగిపోయారు. దేవుడికి మొక్కుకోవడం వలన ఆ దేవుడే నయం చేశాడని కమలమ్మ ఆనందించింది. సమయానికి సరైన

## పూర్ దియా...!

**క**రీనాకు ఉన్న నోటి దురుసుతనం గురించి బాలీవుడ్‌లో అందరికీ తెలిసింది. తోటి హీరోయిన్స్‌తో గొడవపడ్డం కరీనాకు అలవాటే. ఇటీవల దియామిర్జా కరీనా నోటి దురుసుతనానికి బలయింది. లక్నోలో జరిగిన సహారా షోలో పాల్గొనడానికి ఐస్, బిపాసా, నమ్రతా, రవీనా, ప్రీతీ అందరూ వైట్ సల్వార్ కమీజ్ వేసుకున్నారు. అయితే కరీనా మాత్రం అందుకు భిన్నంగా వైట్ గాగ్రా చోళీ వేసుకుంది. పాపం దియామిర్జా నమ్రతతో నోరుజారి అందరూ సల్వార్ కమీజ్‌లు వేసుకొంటే, కరీనా గాగ్రా చోళీ వేసుకుందేమిటి అందట. ఆ మాట విన్న కరీనా దియామిర్జాపై విరుచుకుపడి, నా డ్రస్ గురించి నీకనవరం. నీ పని నువ్వు చూసుకో అని చెప్పింది. ఉత్త పుణ్యానికే ఇలా విరుచుకుపడటం చూసి దియా బిత్తరపోయింది. పూర్ దియా మిర్జా.



సలహా ఇచ్చినందుకు తన కొలీగ్‌కి కృతజ్ఞతలు చెప్పాడు గోపాల్రావు.

రఘురాంకి పూర్తిగా నయమైపోయింది. మళ్ళీ యథాప్రకారం స్కూలుకి వెడుతున్నాడు. కొడుకు మామూలు మనిషి అవడంతో తన మొక్కు తీర్చుకోవాలని కమలమ్మ ఆరాటపడింది. కానీ, భర్త ఒప్పుకోడేమోననే భయం కూడా కలిగింది. రోజులు గడిచినకొద్దీ ఆ మొక్కు మాట మరుగున పడింది.

ఒకసారి ప్రక్కింటి వాళ్ళబ్బాయి పెళ్ళి తిరుపతిలో జరుగుతుంటే వాళ్ళు వచ్చి భార్యాభర్తల్ని తమతో పెళ్ళికి రమ్మని బలవంతం చేశారు. కమలమ్మకి హఠాత్తుగా తన మొక్కు విషయం గుర్తొచ్చింది. అదంతా భర్తకు చెప్పి


"పెళ్ళికి వెళ్ళినట్లు ఉంటుంది! నా మొక్కు చెల్లించినట్లు ఉంటుంది. అనుకోకుండా అవకాశం వచ్చింది" అంది.

ఆ మాట విని గోపాల్రావు కోపంతో అరిచాడు. "నీకేమైనా బుద్ధుందా? ఎలా అడుగుతున్నావ్? అప్పుడైందిగా అనుభవం! నీతో తిరుపతికి ఈ జన్మలో రాను. ఆ ముడుపేదో వాళ్ళకివ్వు!" అన్నాడు.

కమలమ్మ కళ్ళనీళ్ళు కక్కుకుంటూ మౌనంగా ఉండిపోయింది. ఆమె మొక్కు కూడా అలాగే ఉండిపోయింది. తర్వాత రఘురాం డిగ్రీ పాసవ్వడం, ఉద్యోగం, పెళ్ళి వెంటవెంటనే జరిగిపోయాయి. పెళ్ళయ్యాక వధూవరులిద్దరూ తిరుపతి బయలుదేరారు. వాళ్ళతో వెళ్ళి తన మొక్కు తీర్చుకోవాలని కమలమ్మ ఉత్సాహ పడింది కానీ, "కొత్తగా పెళ్ళయినవాళ్ళతో మనమెందుకండీ! వాళ్ళని సరదాగా వెళ్ళిరానీండి" అని వియ్యంకుడు అనడంతో ఇక మాట్లాడలేక పోయింది.

కొడుకు జీవితం ఒక దారిన పడింది. తమ బాధ్యత తీరింది. భర్తను ఒప్పించి ముందు జాగ్రత్తగా మందులవీ వేసుకుని ఒక్కసారి తిరుపతి వెళ్ళిరావాలనుకుంది. భర్త కూడా ఇక కొద్ది నెలల్లో రిటైరవ్వబోతున్నాడు. ఈ లోపు ఒక్కసారి వెళ్ళొస్తే బావుంటుంది అనుకుంటుండగా భర్త రిటైరవ్వడానికి ఆరు నెలల ముందే అనుకోకుండా గుండెపోటుతో ఆయన మరణించాడు. భర్త మరణం ఆమెకు అశనిపాతమైంది. ప్రశాంతంగా సాగుతున్న తన జీవన సరస్సు తీవ్ర సంక్షోభానికి లోనైందని ఆవేదన పడింది. మహావృక్షం కూకటివేళ్ళతో పెళ్ళగించబడితే దాన్ని ఆధారం చేసుకుని ఆనందంగా జీవిస్తున్న తీగ ఒక్కసారిగా నిరాధారమవుతుంది, ఆసరా లేక అల్లాడుతుంది. భర్త మరణం కమలమ్మని శారీరకంగా మానసికంగా క్రుంగదీసింది. కాని కాలానికున్న శక్తి అమోఘమైంది. అది ఎటువంటి గాయాన్నయినా మాన్పుతుంది. మనుమడు పుట్టిన ఆనందంలో భర్త మరణం తాలూకు దుఃఖాన్ని కొంత మర్చిపోగలిగింది. భర్త మరణంతో ఆమెలో తిరుపతి వెళ్ళాలన్న కోరిక కూడా అణిగిపోయింది.

మళ్ళీ ఇన్నాళ్ళకి కొడుకు, కోడలు తిరుపతి బయలుదేరుతున్నారంటే, గతం తాలూకు జ్ఞాపకాలు ఆమెలో మెదిలాయి. తను తీర్చుకోవాలనుకుంటున్న మొక్కు గుర్తుకొచ్చింది. కొడుకు తనని తీసుకెడితే ఆ మొక్కు ఒక్కటి తీర్చుకుంటుంది, ఇక తన జీవితంలో తనకే కోరికలూ లేవు, హాయిగా మరణిస్తుంది. కాని తనకు అంత అదృష్టమా? అనుకుంది కమలమ్మ.




* * *

ఆ సాయంత్రం రఘురాం తల్లితో అన్నాడు.

"అమ్మా! పద్మ చెప్పింది. నువ్వెప్పుడో నా కోసం మొక్కుకున్నావట. ఆ ముడుపేదో ఇవ్వు! మేం హుండీలో వేస్తాం".

"అబ్బే అలా వీల్లేదురా అబ్బీ! నేనే స్వయంగా వెయ్యాలి! అలా మొక్కుకున్నా" అంది కమలమ్మ.

రఘురాం విసుక్కున్నాడు.

"నీకస్సలు బస్సు పడదుగా! ఎలా వస్తావు?"

"అదేమిట్రా? ఆ మధ్య రెండుసార్లు బస్సులో కాకినాడ వెళ్ళి రాలేదా?"

"అది వేరమ్మా! ఈ ప్రయాణం నీకు పడదు. అప్పుడు నీతో ఎంత అవస్థ పడ్డారో నాన్న తరచూ నాకు చెప్తుండేవారు".

"అదెప్పటి సంగతోరా? పోనీ మందు వేసుకుంటాగా!" ఆశగా అడిగింది.

"అమ్మా! నీకక్కడ ఏదైనా అయితే... ఆ కష్టాలు నేను పడలేను. మమ్మల్ని విసిగించకు. సుఖంగా మమ్మల్ని వెళ్ళిరానీ... నీ ముడుపులేవో పద్మకివ్వు... అంతే!" అని వెళ్ళిపోయాడు రఘురాం మరో మాటకి తావివ్వకుండా.

కమలమ్మకి దుఃఖం వచ్చింది. తనెంత బ్రతిమలాడినా కొడుకు రావద్దని ఖచ్చితంగా చెప్పేశాడు. ఎలాగో తనను తీసుకెళ్ళి తన కోరిక తీర్చాలిగాని ఇంత ప్రాధేయపడుతున్నా కాదని చెప్పేస్తాడా? వాడి కోసమే కదా తను మొక్కుకుంది. ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడాడు. ఎంత కష్టమైనా భరించి తల్లి కోరిక తీర్చాల్సిన బాధ్యత వాడికి లేదా? పైగా సుఖంగా 'మమ్మల్ని వెళ్ళిరానీ' అంటాడా? వాడి సుఖానికి, ఆనందానికి నేనడ్డుగా ఉన్నానేమో? ఆయనతో పాటు నేనూ పోయినా బాగుండేది. ఈ అవమానం, బాధా ఉండేవిగావు. కొడుకు ఇంత నిరసనగా మాట్లాడతాడని కలలో కూడా అనుకోలేదు అనుకుంటూ మనసులో కుమిలిపోయింది.

రఘురాం, పద్మా తామనుకున్నట్లుగానే తిరుపతి బయలుదేరారు. వెళ్ళేముందు

"అమ్మా! మేం వెడుతున్నాం. తిరుపతితో పాటు ఆ చుట్టుప్రక్కల పుణ్యక్షేత్రాలు కూడా చూసి నాలుగు రోజుల్లో వస్తాం. నీకేం భయం

లేదు. ప్రక్కవాళ్ళకి చెప్పాను. వాళ్ళు జాగ్రత్తగా చూస్తామన్నారు. వాళ్ళమ్మాయి నీకు తోడుగా పడుకుంటుంది. నీ ఖర్చులకు ఇది ఉంచు" అంటూ తల్లి చేతిలో రెండు వందలు పెట్టాడు.

"జాగ్రత్తగా వుండమ్మా!" అని మరోసారి హెచ్చరించి ఆటో ఎక్కి వెళ్ళిపోయారు.

కమలమ్మ నిర్లిప్తంగా ఉండిపోయింది.

* * *

రాత్రి పది గంటల సమయం

"అమ్మా!" అంటూ తలుపు తట్టబోయిన రఘురాంకి తలుపుకి వేసిన పెద్ద తాళం చేతికి తగిలింది.

"అమ్మ ఎక్కడికి వెళ్ళిందో?" అనుకుంటూ ప్రక్కింటివాళ్ళ తలుపు తట్టాడు.

పక్కింటాయన నిద్రకళ్ళతో వచ్చి తలుపు తీశాడు. ఎదురుగా నిలబడ్డ రఘురాంని చూసి బిత్తరపోయాడు.

"అదేమిటయ్యా! పొద్దున్నేగా బయలుదేరావ్! అప్పుడే తిరుపతి వెళ్ళివచ్చేశావా?" అనడిగా డాయన.

"మేం తిరుపతి వెళ్ళలేదండీ! అక్కడెక్కడో వంతెన దగ్గర బాంబులు పెట్టారట. గూడ్సురైలు పట్టాలు తప్పింది. దాంతో తిరుపతి వెళ్ళే రైళ్ళను కాన్సిల్ చేశారు. బస్సులు స్ట్రైక్ కదా! టాక్సీలు రెట్టింపు ఛార్జీలు అడుగుతున్నారు. అంత డబ్బు పెట్టలేక సగం దూరం నుండే తిరిగొచ్చేశాం! ఇంతకీ అమ్మేదండీ?" అనడిగాడు.

"మీ అమ్మ తిరుపతి వెళ్ళింది".

"తిరుపతా?" తెల్లబోయాడు.

"అవునయ్యా! మీరెళ్ళిన రెండు గంటలకి ఆ అబ్బాయెవరో మూడు కార్లలో వచ్చాడు. మీ నాన్నగారి దగ్గర చదివాట్ట. అతని పెళ్ళి రేపు తిరుపతిలో జరుగుతోంది. మిమ్మల్నందరినీ తిరుపతి తీసుకెళ్ళాలని వచ్చాడు. మీరు లేరు. మీ అమ్మని బ్రతిమాలి బయలుదేరదీసి తనతో తీసుకెళ్ళాడు. తిరుపతిలో పెళ్ళయ్యాక ఆ చుట్టుప్రక్కల పుణ్యక్షేత్రాలన్నీ తిరుగుతాడట. మీ అమ్మకి కూడా అవన్నీ చూపించి తీసుకొస్తాట్ట. మీ అమ్మ వచ్చేసరికి నాలుగైదు రోజులు పట్టొచ్చు. మీరు కూడా కాస్సేపాగి వుంటే ఆ కార్లల్లోనే పోయివుండేవారు. ప్చ్... ఏం చేస్తాం? ఇదిగో మీ ఇంటి తాళంచెవి... వస్తా... నిద్ర వస్తోంది..." ఆయన ఆవలిస్తూ రఘురాంకి తాళంచెవి ఇచ్చి తలుపు వేసుకున్నాడు గట్టిగా. రఘురాంకి ఛెళ్ళున ముఖాన కొట్టినట్లయింది.




వాంటెడ్ డెడ్ ఆర్ ఎలైవ్...

ఆ అమ్మాయిపై డెత్ వారెంట్...

ఓ వైపు మాఫియా ప్రళయంలా...

మరోవైపు డిఫెన్స్ వేట...

వీటి మధ్య ఆ అమ్మాయి

తన ప్రాణాలను పణంగా పెట్టింది

ఆ క్షణమే మొదలైంది

'డింగ్ డాంగ్ బెల్'

మృత్యు ఘంటికలు మ్రోగాయి

గుళ్ళ వర్షం కురిసింది

విచ్చుకత్తుల పహారా మొదలైంది

అన్నింటినీ ఛేదించి, శోధించడానికి

బయల్దేరాడో ధీరోదాత్తుడు

వాట్ నెక్స్ట్?

ప్రముఖ రచయిత్రి

ముచ్చర్ల రజనీ శకుంతల సీరియల్

**డింగ్ డాంగ్ బెల్**

చదివితే మీకే తెలుస్తుంది

అతి త్వరలో ప్రారంభం!

ప్రారంభాన్ని మిస్సవకండి !